# మనిషి మనిషి

తమ మేడ మూడో అంతస్తు కిటికీ దగ్గర నిల్చున్నారు రామన్నారాయణగారు. తమ చేత్తో గడ్డం తడుముకున్నారు. తృప్తిగా నవ్వారు.

ఎవళ్ళ గడ్డాన్ని వాళ్ళు "తమ" చేత్తోనే తడుముకుంటారు గాని ఇంకోరి చేత్తో తడిమించుకోరు కదా — అట్లాంటప్పుడు ప్రత్యేకించి రామన్నారాయణగారు "తమ" చేత్తోనే తడుముకున్నారని చెప్పడం ఎందుకూ అనిపించవచ్చును. అలా అనిపించినవాళ్ళకు ఆయన్నుగురించి ఏమీ తెలియదన్నమాట.

రామన్నారాయణగారి తండ్రి లక్షింపతిరావుగారు పొలాంలో పొగాకు చల్లితే ఎనిమిది వూళ్ళల్లో మేడలూ, అయిదు బ్యాంకుల్లో అకౌంట్లూ పండాయి. లక్షింపతిరావుగారి అనంతరం ఆ లక్ష్మి సమస్తమూ, ఏకైక పుత్రుడయిన రామన్నారాయణగారికి — సంక్రమించింది. చిన్నప్పటినుండే రామన్నారాయణగారికి — సిల్కు లాగులూ, వెండి చట్రాలున్న పలకలూ, వజ్రాలుచెక్కిన గుండీలు వంటివి స్వతహాగా అలవడ్డాయి. నడవడంఅనేది మిగతా మానవులకు ఎంత మామూలో, కారుమీద పోవడం రామన్నారాయణగారికి అంత మామూలూ, అంత సహజమూను. అసలు ఇంట్లో పల కూడా అటూ ఇటూ తిరగడానికి చిన్న చిన్న కార్లలాటివి వుండాలని ఆయన అభిప్రాయం. అలా కార్లు తిరగడానికి వీలుగా విశాలంగా వుంటాయి ఆయన మేడలు, ఆలాటి మేడలలో ఒకదాని మూడోఅంతస్తుపై నించునే ఆయన తృప్తిగా నవ్వారు.

తృప్తి!

ఆయనకు ఎప్పుడూ తృప్తే! ఆయన ఏం చేసినా తృప్తిగానేచేస్తారు. పట్టు తివాసీలూ పదిమంది పరిచారకులూ వున్న తన మేడలో వున్నప్పుడు ఆయనకు ప్రపంచం మీద ఏ మాత్రం కోపంవుండదు. అసంతృప్తి అటు వైపుకు రాజాలదు. అంత ఎత్తునుండి క్రిందకు చూస్తుంటే_ ఆకాశంనుండి నేల మీదకు అతివేగంగా దూసుకొచ్చే గ్రద్ద రెక్కలలో దాగిన సొంపు లాటిది, శక్తిలాటిది ఆయనలో మెదలుతుంది.

అన్నం తింటున్నప్పుడు_ ఆయన మెత్తటి లావాటి చేతులు వెండి కంచంలో బంగారపు కడ్డీల్లా కనబడ్డప్పుడు_ మెత్తటి కాగితాలమీద ముచ్చ టైన రంగులతో చక్కటి డిజైన్‌లతో అచ్చు వేయబడిన పువ్వుల్లాటి 'చెక్కు' పుస్తకాలపై ఏ మాత్రం ఇబ్బందిపెట్టని ఒకటోరకం కలంతో పెద్ద పెద్ద మొత్తాలకు సంతకాలు చేస్తున్నప్పుడు_ మంత్రులు, మహానాయ కులూ, మాడరన్ మహిళలు, తన్ను చూచి నవ్వుతూ నమస్కరించినపుడు రామన్నారాయణగారికిజీవితం మీద, ప్రపంచం మీద ప్రేమ లావాలా ప్రవ హిస్తుంది. ఆయనలో అపుడు సంతృప్తి సముద్రంమీద, పున్నమిలాకురు స్తుంది. అసలు ఎవరికయినా సంతృప్తీ సంతోషమూ మినహా మరొక భావం ఎలా కలుగుతుందీ — జుట్టు పీక్కున్నా ఆయనకు అర్థంకాదు.

ఆ మాటకొస్తే_ అంతలా పీకేసుకోవడానికి — ఆయన కేమీ జపు నములంటు వేణీభరములేదు. కాస్త లావుగా వుంటుంది ఆయన దేహం. మరో విధంగాచూస్తే మెత్తగా వుంటుంది. అప్పటపు వెన్నకలిపిన గోధు మ్పిండితో దోరగా కాల్చిన చప్పాతీలా వుంటుంది ఆయన చర్మపు రంగు. ఆయనవేళ్ళు, మణికట్లు చూస్తే కర్ణుడూ కవచకుండలాలూ గుర్తుకొస్తారు.

రామన్నారాయణగారు నోరు విప్పితే చాలు శిరసావహించడానికి ఏ క్షణాన్నయినా శిరస్సులనేకం వుంటాయి. ఆయన నవ్వితే ప్రతిధ్వనించ డానికి పదిమందయినా వుంటారు. అందుచేతనే — ఆయన గడ్డం ఆయనే గీక్కున్నారన్నది అంత సామాన్యమయిన విషయం కాదుమరి. ఆయనదే

ఒక దిన పత్రిక వుంటే మొదటి పేజీలో 'బాక్స్' కట్టి వేయవలసిన వార్త అది.

రామన్నారాయణగా రెప్పుడూ గొంతెత్తిమాట్లాడి ఎరుగరు. ఆయన దగ్గరకు వచ్చేవారూ అంతే. భయం, భక్తి, ఆశ్చర్యం, గౌరవంలాంటి అన్ని భావాలూ నెమ్మదయిన కంఠంతోనే పలుకుతాయి ఆయన పరిసరాల్లో. ఒక స్థాయిని మించిన కంఠస్వరంవింటే ఆయనకు కొరడాతో కొట్టినట్లుంటుంది. ఆయన రేడియోగ్రాముందా, అదీ అంతే, ఆ మేడలోని తదితర కార్యక్రమాలకు తెరవెనుక సంగీతంగా అతి లలితంగా స్పందిస్తుంటుంది. ఆయన నవ్వడమూ అంతే, నిదానంగా ఆ మెత్తటి పెదాలనువిప్పి, సున్నితంగా ఆ మూల బంగారప్పన్ను మెరిసేలానవ్వి, మళ్ళీ అంత నెమ్మదిగానే పెదాల్ని కలిపేసుకుంటారు....

—అలాటి నవ్వుల్లో ఒక్కదానినే ఇవ్వాళ వెలిగించారాయన మేడమీద కిటికి దగ్గరనిల్చుని. కిటికీని వదలి హాల్లోకి వచ్చారు; రామన్నారాయణగారు కూర్చున్నారు. 'సోఫామీద' అని చెప్పడం కేవలం పాదపూరణ మవుతుంది.

రామన్నారాయణగారికి తెలుపంటే ఇష్టం. ఆ తర్వాత లేతరంగులేవయినా ఫరవాలేదు. కాని ఇంకేదయినా అయితేమాత్రం భరించలేరు.

క్షీరసాగరపు కెరటాల్లావున్న ఆయన హాలు గోడలమీద అక్కడొక్కటీ అక్కడొక్కటీగా నాలుగయిదు పెద్దపెద్ద చిత్రాలు వేలాడుతున్నాయి.

సోఫామీద కూర్చున్న రామన్నారాయణగారి దృష్టి ఒక దానిమీద పడ్డది. ఆచిత్రం పేరు "చంద్రోదయం", గీసినవాడెవడోపిచ్చయ్యట. అంతకన్న ముఖ్యమయినది దాని ఖరీదు. అనగా ఎనిమిదివందలరూపాయలు. ఆ చిత్రంలో రంగులన్నీ చాలమృదువుగా వుంటాయి. నెమ్మదిగా పారుతున్న సెలయేరు, దానిమీద చిన్నచిన్న అలలు, వాటిపై వెన్నెల,

## II

వెండిఅంచుల ఆకాశపు నీలమూ, ఆ నీలానికి హృదయమైనచంద్రుడూ, ఆ చంద్రుడు సెలయేటి కిటూ అటూ పంచుతూన్న వెలుగునీడలు,— ఇది చూస్తుంటే రామన్నారాయణగారికి కమ్మగా భోజనంచేసి కిళ్ళీ వేసుకున్న ట్లుంది.

ఇట్లా అన్ని విధాలుగానూ ఆయన జీవిస్తున్న దొక ప్రత్యేక ప్రపంచం. ఆ ప్రపంచంలో ఆశలకూ ఆచరణకూ సఖ్యత ఎక్కువ. అత గాడి ఇష్టానికి—అర్థంవుంటుంది; కోరికకు రూపం కల్గుతుంది. అందులో ఉంటున్న రామన్నారాయణగారికి తానున్నది ప్రత్యేకమయిన ప్రపంచం అన్పించదు. కాని ఆ పరిధికి బయటవున్నవి పచ్చి నిజాలయినా ఆయనకు తెలియవు తెలుసుకొనబోతే జుగుప్సపుడుతుంది. భయం పుడుతుంది. భూకంపంలాటిది బయలుదేరుతుంది. కనుకనే ఆయన తన పరుపులు గోడలు విడువరు. మరో విధమయిన తలపులకు తలుపులు తియ్యరు.

గడియారం—ఎంతో మర్యాదగా గంట నాలుగని చెప్పేసి నోరు మూసుకున్నది.

'అయింది.... ఇంకో అరఘంటలో శేషమ్మగారు రావాలి'—అను కున్నారు రామన్నారాయణ.

శేషమ్మగారంటే అనేక శరణాలయాలూ అవీ స్థాపించి కొన్ని వందల బాలికలకు ఆధారం కల్పించినావిడ. అమధ్య ఎమ్మెల్యే కాబోయి మానేసినావిడ. అపుడపుడు రేడియోమీద— కృష్ణుడిమీద చంద్రుడిమీద ఆమె కవిమిత్రులు రాసిన గేయాలను అదోవిధంగా పాడే ఆవిడ.

ఆరోయేట ఆమె నొసటకెక్కిన కుంకుమ పదోయేట రాలి పోయింది. కష్టపడి చదివి అనన్యమయిన దీక్షతో నల్గురిలో తానూ ఒక మనిషి నన్పించుకుని, తనలాటివారికి మార్గం చూపించడానికి ముందంజ వేసిందావిడ.

ఆ శేషమ్మ ఇవ్వాళరాత్రి రామన్నారాయణగారి అతిథి.

వారంరోజులక్రింద ఒక బాలికల పాఠశాలలో రామన్నారాయణ గారు బహుమతులందిచ్చిన సందర్భంలో శేషమ్మగారు అక్కడికి వక్తగా వచ్చారు. బహుముఖ్యమైన ఆమె ప్రతిభ నదివరకే బహుముఖంగా విన్న రామన్నారాయణగారా పూట పరిచయాన్ని పురస్కరించుకుని ఆమెను తమఇంటికి భోజనానికి రావలసిందిగాకోరారు. శేషమ్మ ఎంతో సంతోషంతో ఒప్పుకున్నది.

'చంద్రోదయం' మీదినుండి దృష్టిమరల్చి, టేబిల్‌మీద బెల్‌ను నొక్కారు రామన్నారాయణ.

చప్పుడు చేయకుండా ప్రత్యక్షమయ్యాడు సర్వయ్య. సర్వయ్య అంటే ఆ ఇంట్లో సర్వమూ చూసుకునేవాడు. ఓ విధమయిన మేనేజరు లాటివాడు

"విందు ఏర్పాట్లు?" అన్నారు ఇంటిపెద్ద.

"అన్నీ సక్రమంగా జరుగుతున్నాయి"—అని, ఎవరి ప్రమేయమూలేకుండా సజావుగా పనిచేసుకుపోతున్న పెద్ద యంత్రంలోని మర కున్న సంతోషంతో, విన్నవించుకున్నాడు సర్వయ్య.

"ఎప్పుడో తెలుసుకదూ—?"

"ఎనిమిదీ నలభై యెదు కండి"

"డిన్నరు నంబరు?"

"రెండు కదండీ!"

సంతృప్తిగా రామన్నారాయణ తలాడించారు. సర్వయ్య అంతర్ధాన మయ్యాడు.

రామన్నారాయణగారికి ఏ విషయంలోనయినా చిన్న చిన్న వివరాలంటే మహారోత. అదన్నా ఎవరో ఒకరు చూచుకోవాలి. కాస్త డబ్బొంది లినా ఫరవాలేదు. అంతేకాని ఆయన మాత్రం పట్టించుకోలేరు. ఎపుడయినా ఏ గాంధీగారి వ్యాసం తర్జుమాచేయదమో, ఎవరన్నా నవలలు గత్రా

రాస్తే, వాటికి పరిచయం రాయటమో నాయకరాజులకాలంలో తిట్టు కవిత్వం గురించి చర్చించడమో, ఏదయినా చిత్ర కళాప్రదర్శనం తెరవడమో, సాహిత్య అకాడమీ బహుమతిగ్రంధాలు చదవడమో-అయితే బాధ లేదు కాని, ఆదాయ వ్యయాలు రాయడం, ఉత్తరాలకు జవాబులివ్వడం, శాస్త్ర ఇబ్బందిగావున్న దేదయినా చదవడం, ఇంటి విషయాలు చూచుకోవడం ఇవన్నీ ఆయనకు బొత్తిగాగిట్టవు. అట్లాంటివన్నీ చూచుకోవడానికి అమ్మయ్య, మేనల్లుడొకడున్నాడు....గనుక బ్రతికిపోయారాయన. వాడొకడున్నాడు గనుక నిశ్చింత.

ఆ మేనల్లుడే ఈ 'అతిధులు-విందులు'-అన్న విషయాలపై కూలంకషంగా ఆలోచించేసి ఒక సూక్ష్మమైన ఏర్పాటుచేశాడు. అదేమిటంటే, తమ ఇంటికివచ్చే అతిథులందరినీ నాలుగు తరగతులుగా భాగించాడు. మొదటితరగతి అతిథులకు డిన్నర్ నెంబర్ ఒకటి, రెండవతరగతి అతిథులకు డిన్నర్ నెంబర్ రెండు-వగైరా, వగైరా.

డిన్నర్ నెంబర్ ఒకటయితే నాలుగుకూరలూ, నాలుగుపచ్చళ్ళూ, ఆరు పిండివంటలూ, అవీ వుంటాయి. ఏదైనా ఘాటు పానీయమూ వుంటుంది. అదే డిన్నర్ నెంబరు రెండయితే పానీయంవుండదు. మూడు కూరలు, రెండుపచ్చళ్ళు, నాలుగుపిండివంటలువుంటాయి. అలాగే డిన్నర్ నెంబర్ మూడూ; నాలుగూను.

కనుక ఎవరయినా అతిధులు వస్తున్నారు అంటే రామన్నారాయణగారు వాళ్ళస్థాయినిబట్టి, వాళ్ళతో అవసరాన్నిబట్టి, ఫలానా నెంబర్ డిన్నర్ అని చెప్పేస్తే సర్వయ్య అన్నీ చూచుకుంటాడు. అతడు మినహా ఆయన ఇంకో మశకమంత అంశంకూడా పట్టించుకోనవసరంలేదు అలాటి సులువైన, శ్రమరహితమైన ఏర్పాట్లు తాపించిన సిమెంటురోడ్డుపై రామన్నారాయణగారి జీవితరధం సాగిపోతున్నది.

రామన్నారాయణగారు వాచీ చూచుకున్నారు. ఇంకా పదినిముషా ఉంది.

పదకొండో నిముషానికి శేషమ్మను ఈ హాల్లోకి తీసుకువస్తాడు సర్వయ్య. ఆమె అంతకుముందుగా వచ్చినాసరే సర్వయ్య సరిగ్గా ఆ నిముషానికే తీసుకొస్తాడు. తనదగ్గరికి వచ్చేవాళ్ళెవరికయినా తనకు నిముషాల మీదకూడ ఎంత పట్టింపో తెలుసును గనుక టైముకి సరిగ్గా వస్తారు. అలా రాకుండా ఒక్క నిముషం ఆలస్యమయితే ఇంకేమన్నావుందా? రామన్నారాయణగారికి పిచ్చెత్తినట్లయిపోతుంది. ఆయన జీవితమే అంత......ప్రతీదీ, ముందుగానే నిర్ణయించినప్రకారం-ఆయా నిముషానికి ఆయా కార్యం చొప్పున అయిపోతుండాలి. ఇవాళ ఇపుడు కూర్చుని పన్నెండురోజుల తర్వాత ఫలానా గంటకు ఫలానా నిముషానికి తానెక్కడవుండేది, ఏం చేస్తుండేదీరామన్నారాయణగారుచెప్పగలరు. ఆ విధంగా అన్నీ ఠంచన్‌గా, ఫ్రేమ్‌లో బిగించిన ఫొటోలా స్పష్టంగా నిర్ణయించబడివుంటాయి. వేళ తప్పలేని బండి ఆయన బ్రతుకుబండి.

అంచేతే స్వతస్సిద్ధమైన నమ్మకంతో-పదకొండో నిముషానికి శేషమ్మను సర్వయ్య ఈ హాల్లోకి తీసుకువస్తాడని ఆయన అనుకున్నారు.

గడియారం నాలుగున్నర చూపించడమే తరువాయి సర్వయ్య హాల్లోకి అడుగుపెట్టాడు.

"శేషమ్మగారువచ్చారు" అన్నాడు అతడు. ఆమాట నతడు చెప్పకుండానే రామన్నారాయణగారికి తెలుసు.

లేచి రెండడుగులువేసి ఆమెను "రండి, రండి, కూర్చోండి" అని ఆహ్వానించారు.

సిగ్గుతో, సంతోషంతో, కృతజ్ఞతతో, గర్వంతో, శేషమ్మగారు కూర్చుంది.

"ఆలస్యమవుతుందేనని భయపడ్డాను."—అంది ఆమె.

"నా కారు వచ్చేది మీ కోసం_"

"అబ్బే! నేను మా హాస్టల్ వేన్‌మీదవచ్చాను. కాని ఆ ఈడెన్ రోడ్డుదగ్గర అబ్బబ్బ ఎంతట్రాఫిక్కో_! పదినిముషాలు ఆగిపోవలసి వచ్చింది."

సానుభూతి తెలిపారు రామన్నారాయణగారు.

అసలు ట్రాఫిక్‌కు సరిపోని రోడ్లను నిర్మించిన ప్రభుత్వాన్ని కోపడ్డారు. తనకూ ఒక్కసారి అలారోడ్డుమీద ఆగిపోవలసి వచ్చినపుడు కలిగిన చిరాకూ కోపమూ వగైరా విశదీకరించారు. పోనీ ప్రభుత్వం_ తనచేత కాకపోతే పోయింది తనలాటివారు ప్రైవేటురోడ్లు వేయించు కుంటామంటే ఒప్పుకోదుకదా_అని విసుక్కున్నారు రామన్నారాయణ గారు.

ఆయన బాధకు తాను బాధపడింది శేషమ్మ. ఆయన కారును రోడ్డు మీద ఆపడంకన్న మరొక ఘోరం లేదన్నది. మరీ స్వాతంత్ర్యం వచ్చాక అలాగు జనం పేట్రేగిపోతున్నారని విశతంగా విమర్శించింది శేషమ్మ. రామన్నారాయణగారిలాటి వ్యక్తులు ఈ దేశంలో పుట్టదగినవాళ్ళు కాదని తీర్మానించింది శేషమ్మ.

తల ఆడించారు రామన్నారాయణగారు.

అంత ఘాటు ప్రసంగమూ అయిపోయిన తర్వాత బొత్తిగా మౌనంగా వుండడం కాస్త ఇబ్బంది అనిపించి_నవ్వింది శేషమ్మ.

ఈమెకు నాజూకుగా నవ్వడంచేతకాదు_అనుకున్నారు రామన్నారా యణ. అనుకున్న తర్వాత ఆయనా నవ్వారు.

ఎంతోమంది నవ్వగా ఎరిగినశేషమ్మకు రామన్నారాయణగారినవ్వు నాణ్యత, కొట్టవచ్చినట్లు కనపడింది. జీవితంలో - నవ్వులాటి చిన్న విష యంలోకూడా ఇంతటి సంస్కారంకలవ్యక్తి వున్నాడా అని అచ్చెరువందిం దావిడ.

"ఇప్పుడు వేడిగా కొస్త ఏదయినా పుచ్చుకుందామా—" అన్నా రాయన.

"ఊఁ" అని ఆలోచనలనుండి బయటికి వచ్చింది శేషమ్మ. వంట వాడు యాదగిరి పట్టుకొచ్చిన 'ట్రే'లోనుండి వెండికప్పుల్ని తీసి టేబిల్ మీది గాజుపలకమీద పెట్టాడు.

"తీసుకోండి"

ఇద్దరూ తీసుకున్నారు. పదినిముషాలతర్వాత సర్వయ్య వచ్చాడు. ఖాళీ కప్పుల్ని తీయించాడు.

"మరయితే ఆ వెధవ ప్లేన్ మీదపడి వచ్చారుకదా, కాస్సేపు విశ్రాంతి తీసుకోండి. సరిగ్గా ఆరింటికి దమయంతీ నాగరాజుది కూచిపూడి నాట్యంవుంది. వెళ్ళివచ్చి భోంచేద్దాం—" అన్నారు రామన్నారాయణ.

శేషమ్మ నోట మాటరాలేదు. అన్నీఆలోచించి ఏర్పాటు చేయించారు. ఈయన ఎంత మంచివారో—అనుకుంది. ఈయనతో వుండడమే ఒక మహానుభూతి అనికూడా అనుకుంది.

"ఇటు రండి" అని సర్వయ్య ముందుకు నడిచాడు.

శేషమ్మ ఒక్కసారి ఆయన్నుచూసి, సర్వయ్య వెంబడి నడిచింది.

సాయంకాలం అయిదుంబావే అయినా ఇల్లంతా చంద్రోదయమయి నట్లుండింది రామన్నారాయణగారికి.

—అయిదున్నరకు సారథి, వాడే మేనల్లుడు, ఏవో సంతకాలకని వస్తానన్నాడు. వెధవ సంతకాలకు.... ఓ రబ్బరుస్టాంపు చేయించవోయ్ అంటే, బ్యాంకివాళ్ళు ఒప్పుకోర్టః అందరూ జీవితాన్ని ఇంకాస్త బరువుగా చేసేవాళ్ళేకద....

శేషమ్మ ఈగది విడిచి రెండునిముషాలయింది. ఈ పాటికి మెట్లు దిగి రెండోఅంతస్తుచేరి వుండాలి. ఆ హాలు వెనుకవైపు వీలంగది ఎంతో

అందంగావుంటుంది. ఆ గదిగోడలు ఆకాశంరంగులో వుంటాయి. కిటికీ తెరలు నీలంగా అటూ ఇటూ కదులుతుంటాయి. మంచంమీది ఆ మెత్తటి నీలం పరుపును చూస్తేనేచాలు నిద్ర ముంచుకొస్తుంది. ఆ మూలవున్న టెలిఫోనుకూడా నీలమే.

ఇదంతాచూచి శేషమ్మ ఆశ్చర్యపోతుంది. ఆనందిస్తుంది. అతిథి సంతోషంకన్న తనకు కావలసినదేముంది.........ఆ లేత నీలిరంగు గాజు పలకల కిటికీతెరుస్తే పెద్ద బాదంచెట్టు రాజులా నిల్చుని వుంటుంది. దాని మీద రామచిలుకలు గలగల లాడుతుంటాయి.

అమ్మయ్య .... ఆమెవెళ్ళి నాల్గునిముషాలయింది. ఈపాటికి సర్వయ్య ఇలా వెనక్కుతగ్గి, అలా తలుపులుతీసి ఎంతో గంభీరంగా— "ఇదీ....మీ గది" అని ప్రకటిస్తాడు. ఆ అందమూ, సుఖమూ చూసి ఆశ్చ ర్యంతో "ఆః" అంటుంది శేషమ్మ.

అనక తప్పదు— అనుకున్నారు మూడో-అంతస్తుమీదవున్న రామ న్నారాయణ.

సరీగ్గా అలాగే, ఆ నిముషానికే-"ఆః!!" అన్నది శేషమ్మ.

ఎటొచ్చీ ఆమె కాస్తపెద్దగా అన్నది. ఆయన అనుకున్నట్టు ఆశ్చ ర్యంతో కాక భయంతో అరిచింది. బావురుమన్నది.

ఆ కేక రామన్నారాయణగారి గుండెలో శూలమయింది.

శ్రుతి ఎప్పుడో తప్పింది. కళ్లు మూసుకున్నారు.

ఆ కేక తాలూకు ప్రతిధ్వనులింకా ఆయన చెవుల్లో చచ్చిపోక ముందే-పిడుగులు పడుతున్నట్లు అడుగులు వేసుకుంటూ పరుగెత్తు కొచ్చారు. కళ్ళు తెరిచారు రామన్నారాయణ.

"ఆ గదిలో ఎవడో దొంగ వున్నాడండీ—" అని ఒగర్చుతుంటూ ప్రకటించాడు సర్వయ్య.

"ఎక్కడెక్క డెక్క డెక్కడ?" రామన్నారాయణగారి మెదడు స్తంభించింది. ఓటుపడిన రికార్డులా ఆ ఒక్కమాటనే జపించసాగారు. శూన్యంలోకి చూడసాగారు. గుండె తడువుకోసాగారు.

"అదేనండి.... అమ్మగారికని సిద్ధం చేయించిన గదిలోనండి"

"ఎక్కడెక్క డెక్క...."

"అదేనండి_ఆ గదిలో మంచంపైన పరుపుమీద పడుకుని నిద్ర పోతున్నాడండి_" సగం దిగ్భ్రమ, సగం భయంకలిగిన గొంతుతో చెప్పాడు సర్వయ్య.

"వాణ్ణి ఆ గదిలో ఎందుకు పడుకోనిచ్చావు?"_ఎట్టకేలకు ఏదో ఒకటి గట్టిగా అడగ్గలిగారు రామన్నారాయణ. ఇంకా గుండె సర్దుకోలేదు.

"ఎబ్బే, నే పడుకోమనలేదండి.... వాడంతటవాడే వచ్చి పడుకున్నట్లున్నాడు.... దొంగాడుకదండి...." అని పరిస్థితిని వివరించి మరీ చెప్పాడు.

దొంగ.... అయ్యబాబోయ్ దొ_న్_గ....

క_త్తి...నెత్తురు.... హత్య.... అమ్మ నాయిహనోయ్_దొంగ! రామన్నారాయణగారికి చలిజ్వరం వచ్చేసినంత పనయింది.

ఈహడావిడిలో_అదరాబాదరాగా, చీరెకుచ్చెళ్ళు విడిపోతుండగా, పౌడర్ ముఖంమీద కన్నీళ్ళుకాల్వలుగా పారుతుండగా, పరుగెత్తుకుంటూ, ఆయాసంతో అరుదెంచినది శేషమ్మ. ఆమె రెండుచేతులూపట్టుకుని సోఫాలోకి కూర్చోబెట్టారు రామన్నారాయణ.

"మీరేం భయపడకండి_" అన్నారు తనకు తానే చెప్పుకుంటున్నట్లు.

ఊపిరాడక తల ఊచింది ఆమె.

"ఇప్పుడేంచేద్దామండి_" అన్నాడు సర్వయ్య.

రామన్నారాయణగారు 'స్ఫింక్సు'లా వున్నారు.

19

"మన జోరాసింగుని పిలవనేమిటి?" అన్నాడు సర్వయ్య అనన్యమయిన ప్రతిభతో.

అబ్బ! ఇంత బ్రిలియంట్ మనిషి మనప్రక్కనేవున్నాడా ఇన్ని రోజులనుండీను—అన్నట్లుగా సర్వయ్యను చూశారు రామన్నారాయణగారు. "ఆ....అదీ....అంతే....జోరాసింగును పిలిచే....ఆ ....అంతే" అన్నారు ఈదలేక మునిగిపోతున్నవాడికి ఒడ్డు కన్పించినంత రిలీఫ్‌తో.

జోరాసింగంటే దారాసింగంతటివాడు. రామన్నారాయణగారి ఇంటి పెద్దతోటకు సంరక్షకుడు.

మెరుపులా మాయమయ్యాడు సర్వయ్య.

లేచివెళ్ళి శేషమ్మగారి భుజం తట్టారు రామన్నారాయణ. "మీరేమీ....ఇదవకండి...." అన్నారు. ఆమె బెదురుగా చూసింది.

ఇంకాస్సేపటికి సర్వయ్యా, జోరాసింగూ, యాదగిరీ పాలవాడూ ఇంకో ఇద్దరూ కలిసి ఉమ్మడిగా—ఒకరుకాళ్ళూ, ఒకరునడుమూ, ఇంకోరు మెడా, మరొకరు చేతులూగా—ఒకశాల్తీని మోసుకొచ్చారు.

అటు చూడ్డానికే భయంవేసింది రామన్నారాయణగారికి.

చినిగినలాగు, అలాటిదే చొక్కా.అంగుళం మందాన మురికి. పెద్ద గడ్డం. దానికతుక్కుని రెండుకళ్ళు—ఒకకడుపు....

డోకొచ్చింది రామన్నారాయణగారికి. మొహం అటు తిప్పుకున్నారు. గుండె కలుక్కుమంది నొప్పితో. శేషమ్మ గట్టిగా కళ్ళు మూసుకుంది.

"మన లాయర్‌కు ఫోన్ చెయ్యనా?" అన్నాడు సర్వయ్య!

ఇటు తిరక్కుండానే — "ఆ! చేసెయ్యి!"—అన్నారు రామన్నారాయణగారు.

"పోలీసులక్కూడా కబురెడితే—" అన్నాడు యాదగిరి.

"ఆ....అలాగే" అన్నారు రామన్నారాయణగారు.

వాళ్ళందరూ సమిష్టిగా ఆజీవచ్ఛవాన్ని మోసుకెళ్ళిపోయారు.

అయిదు నిముషాలయ్యాక ఇటు తిరుగారు రామన్నారాయణగారు. నిదానంగా సర్దుకోసాగారు. కిటికీలోనుండి బయటికిచూస్తే ఆకాశం ఎప్పటిలాగే కనపడింది. దృష్టి మళ్ళించారు. గోడమీద "చంద్రోదయం" వుండాల్సినచోటేవుంది. ఎడమచేతి వేళ్ళమీద కమలాలూ పుష్యరాగాలూ మామూలుగా నవ్వాయి. ఆయన మామూలు స్థితిలోకి రాసాగారు. కాని గుండె పూర్తిగా సర్దుకోలేదు.

శేషమ్మ సోఫామీద వాలిపోయివుంది. ఇంకా కళ్ళు తెరవలేదు.

సర్వయ్యవచ్చాడు రెండుకప్పుల వెచ్చటిపాలుతీసుకుని. ఇంకోప్పుడయితే కార్యక్రమాల్లో లేని పానీయానికి రామన్నారాయణగారు తీవ్రంగా కోప్పడేవారే.... అసలు సర్వయ్య మాత్రం తెచ్చేవాడా?.... ఈ 'ఆత్యైక' పరిస్థితి ఒకటివచ్చిపడిందికదా.

"పోలీసులొచ్చారు—వాడిచేతులకు సంకెళ్ళు...." అని ఏదో చెప్పబోయాడు సర్వయ్య.

"నాకవేమీ చెప్పకు" గట్టిగా అరిచారు రామన్నారాయణగారు.

"కంప్లయింట్ మీద సంతకం చెయ్యాలట—"

"సారథిని చెయ్యమను. నువ్వే చేసెయ్యి.... లేపోతే ఆ ఇన్స్పెక్టర్నే చేయమను...."

సర్వయ్య వెళ్ళిపోయాడు.

శేషమ్మ కళ్ళు తెరిచింది.

"ఇది తీసుకోండి—" అన్నారు రామన్నారాయణగారు లాలనగా.

ఆమె తీసుకుంది ప్రాణాన్ని త్రాగుతున్నట్లుగా వుందామెకు.

అయిదూ ముప్పైయైదుకు సారథి వచ్చాడు. "మామయ్యా .... వీటన్నిటికీ నువ్వేమీ ఇదవకు.... అన్నీ మరిచిపో.... నే చూసుకుంటా" అని సంతకాలకు చెక్కులు జాచాడు.

వంగి సంతకం పెట్టబోతే మళ్ళీ గుండె తలుక్కుమన్నట్లయింది. ఒక్క క్షణం వెనక్కువాలి కళ్ళుమూసుకున్నారు రామన్నారాయణగారు.

ఏవిటేవిటని శేషమ్మా, సారధి పోటీలు వేసుకుని పరామర్శించారు.

కళ్ళు తెరిచారాయన "కాస్తగుండెనొప్పిగా వున్నట్లుంది"

శేషమ్మగారు నోరు విప్పేలోపుగానే అందుకున్నాడు సారధి—"మరేం.... దారుణాతి దారుణంకదూ.... మరీ అన్యాయమయిపోతూంది దేశం! దొంగలేవిటో, ఇలా పట్టపగలే ఇంట్లోకి నడిచివచ్చి, మహ రాజుల్లా మంచాలమీద పడుకోవడమేమిటి మామయ్యా, గుండెపట్టకోవడ మేమిటిమామయ్యా, గుండె ఏకంగా ఆగేపోతుంది. నువ్వు పాతకాలం మనిషివిగనుక తట్టుకో గలిగావుగాని—"

నెమ్మదిగా తల ఆడించారు రామన్నారాయణగారు.

శేషమ్మ అన్నది "ఈ గొడవలన్నీ మరిచిపోవడానికి మీరు హాయిగా ఏ ఊటీయో వెళ్ళిరండి ...ఆరోగ్యం కాస్త సర్దుకుంటుంది"

"అవును మామయ్యా....అలాచెయ్యి. రేపే విమానంలో సీట్ బుక్‌చేస్తా—" అన్నాడు సారధి అంతకంతకు పెరిగిపోతున్న ఉత్సా హంతో.

"నిజమేనోయ్—ఓ నెలరోజులు అలా వెళ్ళొస్తే ఈ చికాకు పోతుం దేమో—"

"ఓ కే. మామయ్యా—" అని వెళ్ళిపోతున్న సారధిని వెనక్కు పిలిచి— "విమానంమీద రెండుసీట్లు బుక్‌చేయించు." అన్నారు రామన్నా రాయణగారు.

సారధి వెళ్ళిపోయిం తర్వాత, "మీరూ రావాలి. కాదనకూడదు." అన్నారు రామన్నారాయణగారు.

శేషమ్మ నవ్వింది.

ఆ నవ్వులో ఇందాకటికన్న లాలిత్యం వుందనిపించింది రామ

న్నారాయణగారికి.

ఆరురోజులబాటు ఆకలినే తినేసరికి అజీర్ణంలాటిది వచ్చింది. పట్టె దన్నానికని పెద్దమేడలోకెడితె అడ్డేదీరాలేదు. బ్రతికివుండడమే బరువనిపించిన క్షణాన కంటిఎదుట మెత్తటిపరుపు కనిపించింది. చావులాటి మత్తులో మూసుకుపోయిన కళ్ళకు కల వచ్చింది. కలలో లావుపాటి ఆయనా, ఇంకెవరో ఆవిడా, కనుపించి మాయమయ్యారు.

బూటు తన్నులతో తెలిసింది చావు అనే మోక్షం ఇంకా రాలేదని రాత్రి ఉనేం ఈ రాగినూకలగంజి జీవితానికి ఏకైక పరమార్థంగా కనుపించింది. కటకటాలవెనకవున్న ఆకలికి!

('సుధ' జూన్ 67)